# పోడు పట్టాలు కేసీఆర్‌తోనే సాధ్యం



భీమ్‌గల్‌లో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- మానాల గ్రామాభివృద్ధి కోసం రూ.100 కోట్లకు పైగా ఖర్చు చేశాం
- మానాల గ్రామం, తండాల్లో, భీమ్‌గల్‌లో పర్యటన.. పలు అభివృద్ధి పనుల ప్రారంభం

కమ్మర్‌పల్లి/భీమ్‌గల్, అక్టోబర్ 5 : నియోజకవర్గానికి చివరి గ్రామమైన మానాల అంటే తనకు సొంత గ్రామంతో సమానమని, ఇక్కడి తండా ప్రజల కల్మశం లేని ప్రేమ తనకు ఇష్టమమని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఈ రోజు మానాల గిరిజన ప్రజల 762 కుటుంబాలకు 1750 ఎకరాల పోడు పట్టాలు పంపిణీ చేసుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఇక నుంచి మీ భూములకు మీరే రా రాజులు అని గిరిజనులకు పోడు భూముల పట్టాల పంపిణీ ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. ఇది మరెవ్వరితోనూ సాధ్యపడదని మంత్రి స్పష్టం చేశారు. బాల్కొండ నియోజకవర్గం మానాల గ్రామం, తండాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవం, పోడు పట్టాల పంపిణీ కార్యక్రమాల్లో గురువారం మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, తండా వాసులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. మంత్రితో సేవాలాల్ మహరాజ్ పూజ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లంబాడాలు అంటే తనకు అత్యంత ఇష్టమన్నారు. వారు అబద్ధాలు ఆడరన్నారు. ఒక్క ఊరి కోసం వంద కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయని, మానాల ప్రజలను అంతా తన కుటుంబ సభ్యులలాగే చూశానని చెప్పారు. పార్టీ ఎన్నడూ చూడలేని.. ఏ పని కోసం కూడా ఎప్పుడూ తిప్పించుకోలేదన్నారు. మీ జేబు నుంచి రూపాయి ఖర్చు కానివ్వలేదన్నారు. మానాల గ్రామంలో 11 కులాలకు సంఘ భవనాలకు తీజ్, సేవాలాల్ భవనాలు రూ.67 లక్షలు, రూ.60 లక్షలు ఇతర సంఘ భవనాలకు ఇచ్చామని మొత్తం ఒక్క గ్రామంలోనే రూ.1.27 కోట్ల సంఘ భవనాలకు నిధులు ఇచ్చామని చెప్పారు. 16 తండాలుంటే 4 గ్రామపంచాయతీలు అధికారులు ప్రపోజల్ చేస్తే గిరిజన ప్రజల అభీష్టం మేరకు తాను 8 గ్రామపంచాయతీలు చేయించానన్నారు. తీజ్ పండుగకు మహిళకు తీజ్ భవనాలు/ సేవాలాల్ భవనం ఒక్క బాల్కొండ నియోజకవర్గంలోనే ఇచ్చాం. రాష్ట్రంలో ఇట్లా ఎక్కడా లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు వచ్చి అయోమయంలో పడేసే మాటలు చెబుతారని.. వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మోసపు మాటలు నమ్మొద్దని కోరారు. మీ కండ్ల ముందు కనిపిస్తున్నదే వాస్తవమని.. అదే నమ్మాలన్నారు. గృహలక్ష్మి పథకం ఇప్పుడు కొంతమందికి.. వచ్చే సారి మిగిలిన వారికి ఇస్తామని, అర్హులై పెన్షన్లు రాని వారికి కూడా ఇస్తామని హామీనిచ్చారు. మీలో ఒక్కడిగా మీ స్వంత అభివృద్ధి కోసం కృషి చేశానన్నారు. గిరిజన ప్రజల చిరకాల కోరికలను సీఎం కేసీఆర్ దయతో నెరవేర్చానన్నారు. మానాలగ్రామ, తండాల ప్రజల ఆశీర్వాదం కేసీఆర్‌కు, తనకు ఎప్పుడూ ఉండాలని కోరారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. ఇక్కడ జరిగిన అభివృద్ధిపై ముఖ్యంగా యువత ఆలోచన చేయాలని కోరారు. అనంతరం హనుమాన్ తండా గొర్రె గుండం రోడ్డు పనులకు రూ.1.12 కోట్లతో శంకుస్థాపన, మానాల రుద్రాంగి రోడ్డుపై తాతమ్మ బ్రిడ్జి నిర్మాణ పనులకు రూ.2.20 శంకుస్థాపన చేశారు.

పలు కులసంఘ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి, ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. అనంతరం రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన దేగావత్ తండా గ్రామపంచాయతీ భవనాల ప్రారంభోత్సవం చేశారు. అనంతరం భీమ్‌గల్ పట్టణంలో రూ. 2.80 కోట్లతో నూతనంగా నిర్మించనున్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలతాసురేందర్, ఎంపీపీ చౌట్‌పల్లి రవి, జడ్పీటీసీ రవి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు మొయిజ్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుణ్‌వీర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో నియోజకవర్గ అభివృద్ధి



రాజంపేటలో బైక్‌పై తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- రాజంపేట్, నర్సన్నపల్లిలో అభివృద్ధి పనుల ప్రారంభం

రాజంపేట్/కామారెడ్డి రూరల్, అక్టోబర్ 5 : కామారెడ్డి నియోజకవర్గం అన్ని రంగాల్లో దూసుకుపోతున్నదని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డి మండలం నర్సన్నపల్లి శివారులో రూ.25.22 కోట్లతో నిర్మించిన గోదామును, రాజంపేట మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. రాజంపేటలో బైక్‌పై తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాల హయాంలో లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రస్తుతం అమలవుతున్నాయన్నారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఎంపీపీలు లింగాల స్వరూపా కృష్ణమూర్తి, పిప్పిరి ఆంజనేయులు, నర్సింగ్‌రావు, ఉరుదొండ నరేశ్, ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం జీతగాడిలా పని చేస్తా

**‘నమస్తే నవనాథపురం’లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి**

నందిపేట్, అక్టోబర్ 5 : ‘నాది అభివృద్ధి, సంక్షేమ వాదం. ఆర్మూర్ నియోజకవర్గ డెవలప్‌మెంట్ నా సెంటిమెంట్. నా నియోజకవర్గ ప్రజల కోసం ప్రాణదానానికైనా సిద్ధం, సిద్ధుల గుట్ట శివయ్య సాక్షిగా చెబుతున్న జీవితాంతం మీకోసం జీతగాడిలా పని చేస్తానని‘ పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. నమస్తే నవనాథపురంలో భాగంగా గురువారం నందిపేట్ మండలం బాద్గుణ గ్రామంలో ‘ప్రజాశీర్వాద యాత్ర’ నిర్వహించారు. గ్రామంలో పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన ప్రతిఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ ప్రజల యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసరా పింఛన్లు, రైతుబంధు, షాదీ ముబారక్, రైతుబీమా వంటి పథకాలతో ప్రతి ఒక్కరికీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గృహలక్ష్మి ద్వారా ఇండ్లు నిర్మించుకోవడానికి రూ.3లక్షల చొప్పున మంజూరు చేయబోతున్నామని, బీసీ వర్గానికి చెందిన 15 కుల వృత్తుల వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక చేయూతనందిస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతల కు అభివృద్ధి అంటే కండ్ల మంట, వాళ్లు ఓట్ల కోసం వచ్చే దసరా వేషగాళ్ల సంక్రాంతి గంగిరెద్దులు, కాంగ్రెస్, బీజేపీలను నమ్మి ఓటేస్తే మిమ్మల్ని కాటేస్తాయన్నారు. కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని.. తాను హ్యాట్రిక్ సాధించి తీరుతానని జీవన్‌రెడ్డి ఉద్ఘాటించారు.



తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలుపడంతో అంగన్‌వాడీ టీచర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు.
-భీమ్‌గల్,అక్టోబర్ 5

# అన్ని వర్గాలు సంతోషంగా ఉండడమే లక్ష్యం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ షిండే

- ఎమ్మెల్యే హన్మంత్ షిండే
- బిచ్కుందలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం
- ఆడపడుచులకు బతుకమ్మ చీరల పంపిణీ

నిజాంసాగర్, అక్టోబర్ 5: తాను జుక్కల్ నియోజకవర్గ బిడ్డనని, ఈ నియోకవర్గంలోని అన్ని మండలాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చానని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. మీ అందరి ఆశీర్వాదంతో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని మీ అందరికి ఇచ్చిన మాట ప్రకారంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని అన్నారు. బిచ్కుంద మండలంలోని గోపన్‌పల్లిలో పంచాయతీ భవనం, ఎస్సీ కమ్యూనిటీ భవనం, లింగాయత్ భవనానికి భూమి పూజ, బిచ్కుంద మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ, బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాతే జుక్కల్ నియోజకవర్గం రూపురేఖలు మారిపోయాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతోనే కోట్లాది రూపాయలతో సంక్షేమ, అబివృద్ధి పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. మరో మారు ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే ధ్యేయంగా ముందుకు సాగుతానని అన్నారు. తాజాగా బిచ్కుంద మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను వంద పడకలకు అప్‌గ్రేడ్ చేసుకున్నామని, ఈ నెల 6వ తేదీన మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసుకోబోతున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, నాల్చారీ రాజు, పార్టీ అధ్యక్షుడు మండల వెంకట్రావ్‌దేశాయ్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నాగ్‌నాథ్‌పటేల్, బస్వరాజ్‌పటేల్, గణేశ్‌గౌండ తదితరులు పాల్గొన్నారు.